# "అన్నం తినుడు రుసికోసురమా? కడుపు నిండుటాని గ్గని!"

మా నాయిన్న నన్ను కొట్టే పోషాలు పదిరూపాయలిచ్చేదుంది అడుక్క రాపో అని తోలిండు. నేం బోయెవారకు పోషాలు వాకిట్ల గొంగడిమీన ముడ్డిమోపి మునిగాళ్ళమీన గూసున్నడు. ముందట కంచుతలుంది.[26] ఎడమ చెయ్యిదిక్కు కంచు చెంబుల నీల్లున్నయి. తలెల నూకల బువ్వున్నది. దాన్నటూ ఇటూ కలుపుతండు పోషాలు. పచ్చి పులుసుతోని కలుపుతున్నట్టున్నడు బువ్వదో రంగులుంది. పోషాలు పెండ్లాం కొట్టెమల్లమ్మ దరువాజ కడుపుకాడ కూసోనుంది.

"తాత.......తాత......నాయిన్న పైసలియ్యమన్నడు" అన్న నేను.

"సానొద్దులాయె మనుమడ! పైసలెల్లకియ్యలే. నాయిన్న కోపానికి రావచ్చు. మా ఇత్తగనట్లు మంచాలగూసుండు" అన్నడు పోషాలు.

"గా సందుగుల పైసలున్నయి తెచ్చియ్యే" అన్నడు పెండ్లాంతోని.

"నువ్వేడ పెట్టినవో దొరుకయి నాకు. తిన్నంక నువ్వే ఇత్తువు తియ్యి. గా పిల్లగాడేడికి పోతడు. ఏమన్న పడావు జేసేదుందా? అట్ల కూసుంటడు నువ్వయితె బువ్వ దిను" అంది మల్లమ్మ.

"నేను మా ఉంట. అన్నం తిన్నంకిత్తువు కని తిను తాత" అని మంచం పట్టెమీద కూసున్న నేను.

తల్లెలున్న అన్నం అటీటు కలిపి నోట్లె పెట్టుకున్నడు పోషాలు. మొకమంత సిట్లిచ్చున్నడు. "ఇదేమన్న కూడేనాయె. ఎట్లపాడైందే?"

"అయ్యో! మొగాయినెకు గిది బువ్వ తీరుగ కనవడుతలేదా? ఇసిత్రం సెయ్యవడితివేంది" కారెడ్డమాడింది మల్లమ్మ.

"బువ్వనిండ ఒలిపిల్లు[27] పాడయినయి. పోసుక తాగుటానికేమో గీ పచ్చిపులుసు కాలవెడితివి. గిదెట్ల నోట్లెకు పోవాలె?"

"మిరాల మెతుకులు మా అండిపెడుదు గని మరి ఇంట్ల బియ్యం లెవ్వు గద! ఇంట్ల తెచ్చిపెట్టినంక అండిపెట్టటానికి కట్టమా? ఇంట్లున్న యండిపెడుతున్న" సేతులూపుకుంటంది మల్లమ్మ.

"బువ్వంటె గట్లుండెగని కొంచెమంత కూరన్నండక పెయినావె?"

"పచ్చి పులుసు సెయ్యన్నే సేత్తి. గంతకంటెక్కో ఏం జెయ్యన్నో సెప్పు. మనకేమన్న తోటుందా. కూరగాయలు పండిచ్చుటానికి! కయికిలివోతె కుంచెడన్ని పెసల్లత్తె ఎంతకనుంటయి? పప్పన్నేత్తామంటె పెసల్లోడిసిపాయె. కూరగాయలు కొనండుమంటవా?"

"అన్నిటికన్ని సెప్పుతవు గని గీ కూడెట్ల తినన్నో సెప్పు?"

"తినకుంటూకో. నేనేన్నుంచి తేవాలె సెప్పు. నీతోని సరిసమానంగ కయికిలి సేత్తన్ననా? పొద్దుగాల వోతె మల్ల నాత్తిరికే ఇంటికచ్చుడా? గీ కయికిలి సేసుకుంట కమ్మంగ, తియ్యంగ, కాయిపాయిగ తినన్నంటె మనకెట్ల ఎల్లుద్ది సెప్పు. దొరికింది తినాలె?"

"నోరు తెరిత్తె పురాణం సదువుద్ది. సావుకారి తోలిత్తె సొప్పదండిరాక పొయ్యత్తి. కాల్లు గుంజవట్టె. కడుపునిండింత కూడుదిని పందామంటె గిది ముందట వెడితివి" అని ఒక్కొక్క బుక్క ఒలిమేటికి నోట్లె వెట్టుకుంటుండు పోషాలు.

"అయ్యో! ముసల్తనానికి దసల్ రైకని[28] గియ్యాల్ల గిట్ల మాట్లాడవట్టివేంది? ఇన్నేండ్లవట్టేందింటివి? రుసుల్జూసే తింటివా? గడుకో, అంబలో, గంజో, కారమో, మన్నో-మస్తానమో కడుపునింపుకోవాలె గని ఎవ్వలమీన నిష్టూరమాడుతవు?" అంది ముసలమ్మ.

వాళ్ళ మాటలింటుంటె నాకాన్నుంచి కదులబుద్ది గాలే.

"గీ పులుసులింత తాలుపన్న వెట్టకపెయినవా?

"తాలుపు వెట్టుటానికి నూనేడు కాలవడ్డది? ఇదువరకే ఇరవై రూపాయలియ్యాలె కొమటయినెకు. కనిపిచ్చినపుడల్ల అడుగుతండు. నా పజీతు వోతంది" మొకం మాడ్చుకుంటంది మల్లమ్మ.

"సరెగని ఇంకేమన్నుంటెయ్యి. దీంతోని తినవుద్దయిత లేదు".

మల్లమ్మ ఇంట్లకుపోయి మట్టిసిప్ప తెచ్చింది. అండ్లున్న తొక్కును చెయ్యితోందీసి తలెలేసింది.

"గీ పచ్చి మిరపకాయ కారంతోనెట్ల దినాలె?" అని బలిమీటికా అన్నం దింటండు పోషాలు. మింగలేక మింగుతుండు. ఇంతల మల్లమ్మ అన్నం ఎసులదెచ్చి[29] అండ్లకెల్లి ఇంకింత బువ్వదీసి తలెలేసింది.

"గింతంత గంజున్నది పోసుకో" అని కడుముంతలున్న గంజిని తలెల పోసింది.

అ బువ్వ ఆ తొక్కు, గంజిసూత్తంటె రోమాలు నిక్కపొడ్సినయి నాకు. గంజిబువ్వ కలిపిండు.

"కొద్ది గంతుప్పెయ్యి" అన్నడు.

"ఉప్పు పులుసులకే అయిపోయింది. ఎట్లనో తినిగ. పొద్దుగూకి తెత్త ఉప్పు" అంది.

"ఎట్ల తినన్నే నీ యవ్వ! ఇంట్లేముందో లేదో సూసుకోవద్దానె? దొంగలం....."అని తిడుతూ అన్నం తింటండు పోషాలు.

"సాతగాకుంటయినకొద్ది ముసలయినెకు కోపం బాగనే అత్తంది. ముసల్తనానికి రుసులు గావన్నట. బువ్వ దినుడు రుసి కోసురమా? ఉప్పు లేకుంటె బువ్వ నోట్లెకు పొదట మొగయినెకు. బాగ సంపాయిచ్చి పెడ్తన్ననుకుంటండో? దొరతనం సేత్తన్ననుకుంటండో? ఎట్లుంటె గట్లదినాలె. ఇన్నొద్దులు లేంది గిప్పుడేమో సోకులమాటలు మాట్లాడవడితివేంది? బువ్వదినుడు కడుపునిండుటానిగ్గని రుసులకోసురమా? మంచి మంచోల్లు బూమి, జాగలున్నోల్లు, నోసలురాత మంచిగున్నోలు రుసికోసురం దింటరు. మనం కడుపునిండుటానికన్నం దినాలె. ఈ నూకల బువ్వ గూడ దొరుకనోల్లెంతమంది లేరు? పాడు మొకానికి గిది తెలువదా? మల్ల గిట్ల గసోంటి మాటలు మాట్లాడేవు? గా మనుమన్ని మంచాల గూసుండవెట్టి బూతులు తిడ్తన్నవా నన్ను? నీ మొకం పాడుగాను" సొదంతెల్లవోసింది మల్లమ్మ. పోషాలు తులకాయ వంచుకున్నడు.

"సూడు మనుమడా! ఎంత కట్టం జేసినా గింతే కావట్టె. గీ బతుకు బతుకుడు కంటె సచ్చింది నయ్యం. రోజు షావుకార్లు బెల్లంబుట్టలు, ఇంకేమన్న సామాన్లు తెమ్మంటె చొప్పదండికి పోయి మోసుకత్త. నా కాళ్ళన్ని నడిసి నడిసి నాశినెం గావట్టె. గా పనిలేకుంటె కైకిలి జేత్తి. నీ యవ్వ! గీ కట్టం బతుకు పాడుగాను. మంచి మంచోల్లకు సావు రావట్టె. నాకత్తలేపాయె" అనుకుంట బువ్వదినుడు కతంజేసి మూతి తుడుసుకుంట లేసిండు పోషాలు.

"గట్లెందుకంటవు తాత! కాలమెప్పటికొక్క తీరుగనే ఉంటదా?" అని నేను సముదాయించిన.

లోపలికి పొయ్యి పైసల్దెచ్చి నాకిచ్చిండు పోషాలు తాత.

"పోతన్న తాత" అని నేనింటి మొకానచ్చిన. మల్లమ్మ మాటలల్లున్న జీవిత సత్యాలు గుర్చొచ్చినప్పుడూ ఆలోసిత్తనే ఉంటనేను.

ఇప్పుడు పోషాలు, మల్లమ్మలు పురాగ ముసలోల్లయింట్రు. నడుము లరిగినయి. కనాల్ల బతుకులల్ల పెద్ద మార్పులేం రాలే. కైకిలి జేసుకుంటనే బతుకుతున్న కొడుక్కు సాయం జేసుటానికాల్లూ కైకిలి జేత్తంట్రు. గట్లనే బతుకుతంట్రు.

నేనూల్లె కనవడ్డప్పుడల్ల ఎప్పుడచ్చినవు మనుమడా అనడుగుతడు.

"మంచిగున్నవా మనుమడా? నీ కొడుకులు, బిడ్డలు మంచిగున్నరా? నా మనుమరాలెట్లుంది? సల్లగ బతుకుండ్రి కొడుకా" అని దీవిత్తడు.

★ ★ ★